aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
29-09-2026 సంపుటి : 01 సంచిక :188 పేజీలు : 08 వెల : ₹ 5/-

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

యూపీఐ చార్జీలపై వివరణ ఇవ్వండి

- ం కేంద్రాన్ని కోరిన సుప్రీం కోర్టు
- ం స్టే ఇచ్చేందుకు నిరాకరణ
- ం ఛార్జీలకు చట్టబద్ధత ఏంటని ప్రశ్నించిన సుప్రీం
- ం ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా నోటీసులు జారీ
- ం నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



రకూల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు

- ం రకూల్‌తో పాటు మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు
- ం ఫిల్మ్ ప్రాజెక్టుల నిధుల మళ్లింపుపై ఆరా
- ం విదేశీ లావాదేవీలను పరిశీలిస్తున్న ఐటీ అధికారులు
- ం డాక్యుమెంట్లు, ఆర్థిక రికార్డుల తనిఖీ
- ం నిర్మాత వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్ ప్రాంగణాల్లోనూ సోదాలు





తెలంగాణలో కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్

- ం నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ం తెలంగాణలో కొత్త బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ జారీ
- ం దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజుగా నిర్ణయం
- ం అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ, 16న లాటరీ ద్వారా కేటాయింపు
- ం కొత్త బార్ల ద్వారా ప్రభుత్వానికి రూ.14.62 కోట్ల వార్షిక ఆదాయం అంచనా
- ం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 14, ఇతర మున్సిపాలిటీల్లో 27 బార్ల ఏర్పాటు అంచనా

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సెప్టెంబర్ 28 (మహాప్రభ) తెలంగాణలో కొత్తగా 41 బార్ అండ్ రెస్టారెంట్లు (2బి) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరితో కూడిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయుఆర్) పరిధిలో 14, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27 బార్లకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నేటి నుంచి అక్టోబర్ 12 వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దరఖాస్తులు స్వీకరిస్తారు.

-మిగతా 3 లో

తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు

టీడీపీ బలహీనపడటంతో ప్రజల సూచన మేరకు కాంగ్రెస్‌లో చేరా

- ం నాణ్యమైన విద్యే తెలంగాణ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- ం విద్య వల్లే అంబేడ్కర్ రాజ్యాంగం రచించారు
- ం అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా
- ం 2014 తర్వాత తెలంగాణలో కేసీఆర్ వర్సెస్ రేవంత్
- ం ఇది ప్రజలందరికీ అందుకే వివరిస్తున్నాం
- ం సీఎం రేవంత్ రెడ్డి




తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా పోటీ మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తనను అనేకసార్లు జైలుకు పంపిందని, అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లానని చెప్పారు. ఢిల్లీలో జరిగిన 'ది కాంక్లేవ్ 2026'లో పాల్గొన్న ఆయన.. తెలంగాణ రాజకీయాలు, విద్య, తన రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్‌లో చేరిక తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి సెప్టెంబర్ 28 (మహాప్రభ) తెలంగాణ అసెంబ్లీకి వెళ్లిన దాని కంటే తాను ఎక్కువగా జైలుకే వెళ్లానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపారని పేర్కొన్నారు. 2014 తర్వాత తెలంగాణలో కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారిందని ఆయన చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై మాట్లాడిన ఆయన..

-మిగతా 3 లో

టోల్ బూత్‌లకు గుడ్‌బై.. ఇక నాన్‌స్టాప్ జర్నీ!



- ం టోల్ ప్లాజాల వద్ద ఇక పడిగాపులు అవసరం లేదు
- ం మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానానికి శ్రీకారం
- ం వాహనాలు ఆగకుండానే టోల్ వసూళ్లు
- ం ఫాస్టాగ్‌తోపాటు నంబర్ ప్లేట్ స్కానింగ్
- ం ఆర్ఎఫ్ఐడీ, కెమెరాలు, సెన్సర్లతో ఆటోమేటిక్ టోల్
- ం ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకున్నా నంబర్ ప్లేట్‌తో గుర్తింపు
- ం తెలంగాణలో 11 టోల్ ప్లాజాలకు కొత్త విధానం
- ం టెండర్ల ప్రక్రియలో ఎన్‌హెచ్ఏఐ, ఐహెచ్ఎంసీఎల్
- ం మరో ఐదారు నెలల్లో అమల్లోకి వచ్చే అవకాశం
- ం గుజరాత్‌లో ప్రయోగం.. ఇతర రాష్ట్రాలకు విస్తరణ

చలాన్లు కట్టకపోతే కరెంట్ బిల్లుతో కలపండి!

- ం పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై సుప్రీంకోర్టు ఆందోళన
- ం రూ.20 వేల కోట్లకు పైగా ఈ-చలాన్ల బకాయిలు
- ం చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులకు జతచేయడంపై సూచన
- ం చలాన్లు వసూలుకు ఇతర మార్గాలు అన్వేషించాలని ఆదేశం
- ం ఆర్‌సీ పునరుద్ధరణ నిలిపివేతను పరిశీలించాలని సూచన
- ం వాహనాల యాజమాన్య బదిలీని అడ్డుకునే అంశంపై చర్చ
- ం పెండింగ్ చలాన్ల వాహనాలను పరివాహన్‌లో బ్లాక్‌లిస్ట్ చేసే యోచన
- ం డ్రైవింగ్ లైసెన్స్, పీయూసీ పునరుద్ధరణపైనా ఆంక్షల ప్రతిపాదన
- ం చెల్లించని చలాన్ల వాహనాల తనిఖీలకు సూచన
- ం విద్యుత్ బిల్లుతో కలపడం ఆదేశం కాదు.. కేవలం సూచనే





స్థానిక ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

- ం స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కేడర్‌కు దిశానిర్దేశం
- ం పార్టీ ముఖ్య నేతలతో కల్వకుంట్ల కవిత వరుస సమావేశాలు
- ం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బలంగా పోటీ చేయాలని సూచన
- ం పాంచజన్య సంకల్ప సభలపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్న కవిత
- ం ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు తక్షణమే స్పందించాలని పిలుపు
- ం రిమ్స్ ఘటనపై పార్టీ పోరాటంతోనే ప్రభుత్వం స్పందించిందన్న కవిత
- ం ఉమ్మడి జిల్లాల వారీగా బుధవారం వరకు కొనసాగనున్న సమావేశాలు
- ం మెడికల్ సీట్ల స్థానికతపై జీవోలు 33, 150 రద్దు చేయాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మహాప్రభ) రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటేలా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నేతలతో సమావేశమైన కవిత.. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు

-మిగతా 3 లో



ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత

- ం ఇరాన్ శాంతి ప్రణాళికను ట్రంప్ తిరస్కరణ
- ం అమెరికాతో యుద్ధానికైనా సిద్ధమన్న ఇరాన్
- ం అంతిమ యుద్ధం వచ్చినా ఎదుర్కొంటామన్న అరాగ్చీ
- ం చర్చలకు తాము సిద్ధమేనని ఇరాన్ స్పష్టీకరణ
- ం హర్ముజ్ జలసంధి తెరవాలంటే షరతులు నెరవేర్చాలి
- ం ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు తిరస్కరణ
- ం స్తంభించిన దౌత్య చర్చలకు మళ్లీ అవకాశం
- ం ఫ్రీజ్ చేసిన ఆస్తులు విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్
- ం చమురు విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేయాలని విజ్ఞప్తి
- ం అమెరికా డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్న ఇరాన్

పట్టభద్రులు మన వైపే

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే

- ం హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ స్థానంపై కేటీఆర్ ధీమా
- ం ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ
- ం పట్టభద్రుల ఓటరు నమోదుపై నేతలు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ం అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకునేలా చూడాలి
- ం యువత, నిరుద్యోగులు, విద్యావంతులు ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారన్న కేటీఆర్
- ం బీజేపీకి యువత దూరమవుతోందని కేటీఆర్ వ్యాఖ్య
- ం నేతలంతా సమన్వయంతో పనిచేసి గెలుపు కోసం కృషి చేయాలి
- ం పట్టభద్రుల ఓటరు జాబితాలో కేటీఆర్ పేరు నమోదు



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మహాప్రభ) హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని కేటీఆర్ సూచించారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీకి అనుకూల వాతావరణం ఉందని ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున

-మిగతా 3 లో

టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తు తేల్చేందుకు ఈసీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్



న్యూఢిల్లీ సెప్టెంబర్ 28 (మహాప్రభ)

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లో రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. టీఎంసీ పేరు, ఆ పార్టీ ఎన్నికల గుర్తు అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లోగా ఈ అంశాన్ని తేల్చాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టంది. పార్టీ పేరు, గుర్తు అంశంలో బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేశారు. అయితే టీఎంసీకి చెందిన రెండు వర్గాలు తమ వాదనలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు నాలుగు వారాల్లోగా సమర్పించాలని సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.ఇక ఈ అంశాన్ని మూడు నెలల్లోగా తేల్చాలని కూడా ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం అల్టిమేటం జారీ చేసింది. టీఎంసీ పేరు, పార్టీ సింబల్‌ను ఈసీ ఫ్రీజ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించారు. అయితే రెండు వర్గాలకు ఈసీ రెండు రకాల పేర్లు, గుర్తులను ఇటీవల కేటాయించింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇది కీలకాంశంగా మారింది.

'వాళ్లకు ఓటర్లంటే భయం లేదు'..

- మంత్రి పర్వేశ్ వర్మ తీరుపై రాహుల్‌గాంధీ ఆగ్రహం..!



న్యూఢిల్లీ సెప్టెంబర్ 28 (మహాప్రభ)

ఢిల్లీలో మంత్రి పర్వేశ్ వర్మ రోడ్లను తనిఖీ చేస్తుండగా వీడియో తీసిన యువకుడిని అతడు చెంపదెబ్బ కొట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. మంత్రి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ నేతలకు ఓటర్లంటే ఏమాత్రం భయం లేదని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. తమ సమస్య గురించి ప్రశ్నించినందుకు ఓ యువకుడిని చెంపదెబ్బ కొట్టడం సరైన చర్య కాదన్నారు.వీడియోలో ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన బీజేపీ మంత్రి ఒక యువకుడిని చెంపదెబ్బ కొట్టడం కనిపిస్తోందని, అతడు చేసిన నేరం ఏమిటి..? అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రజల మధ్యలో ప్రశ్నిస్తే చెంపదెబ్బ.. పేపర్ లీక్స్ గురించి అడిగితే లాఠీఛార్జి.. పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే మైక్ స్విచ్ఛాఫ్ చేయడం.. ఇవన్నీ అధికారం ఉందనే అహంకారంతో చేసే చర్యలన్నారు. తప్పుచేస్తే ప్రజలు తమను గద్దె దించుతారనే భయం వారిలో లేదని విమర్శించారు. బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చేది ఓటు చోరీతో అని, అందుకే వారికి ప్రజల మద్దతుతో అవసరం ఉండదని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందిస్తూ.. ఇలాంటి విషయాలకు ఆయన దూరంగా ఉండాలని సూచించారు. ఆయనకు ఏమీ తెలియదని, తెలిసీ తెలియక ఏదేదో మాట్లాడుతారని వ్యాఖ్యానించారు.

తొలిసారి భూకక్ష్యలోకి స్టార్‌షిప్

స్పేస్‌ఎక్స్ కీలక ప్రయోగం



న్యూయార్క్ సెప్టెంబర్ 28 (మహాప్రభ)

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ అత్యంత భారీ రాకెట్ స్టార్‌షిప్‌ను తొలిసారి భూకక్ష్యలో ప్రవేశపెట్టింది. సోమవారం టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ నుంచి చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. అయితే స్టార్‌షిప్‌లోని ఓ థ్రస్టర్‌లో లోపం తలెత్తడంతో నిర్ణయించిన సమయానికి దాదాపు ఏడు గంటలు ముందుగానే మిషన్‌ను ముగించాల్సి వచ్చింది. ఈ మిషన్ సుమారు 10 గంటల పాటు కొనసాగుతుందని తొలుత అంచనా వేశారు.కానీ సూపర్ హెవీ బూస్టర్ నుంచి విడిపోయిన తర్వాత స్టార్‌షిప్‌లోని ఒక థ్రస్టర్ పనిచేయకపోవడంతో ముందుగానే ప్రయోగాన్ని ముగించారు. దీంతో స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్‌ను నియంత్రిత పద్ధతిలో పసిఫిక్ మహాసముద్రంలో హవాయి సమీపంలోని నిర్దేశిత ప్రాంతంలో కూల్చివేసింది. గతంలో స్టార్‌షిప్ 13 సబ్ ఆర్బిటల్ పరీక్షా ప్రయోగాలు నిర్వహించినప్పటికీ, వాటిలో ఏదీ భూమి చుట్టూ పూర్తి కక్ష్యను పూర్తి చేయలేదు.

షాహి మసీదు తొలగింపు..

- ఉజ్జయినిలో పోలీసులతో ఘర్షణ



ఉజ్జయిని సెప్టెంబర్ 28 (మహాప్రభ)

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని లో పోలీసులకు, ఓ వర్గానికి మధ్య ఘర్షణ జరిగింది. ఆ నగరంలో ఉన్న షాహి మసీదుకు చెందిన కొంత భాగాన్ని తొలగించాలని భావించారు. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా మసీదులో కొంత నిర్మాణాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టారు. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గం ఆందోళన చేపట్టంది. భారీ స్థాయిలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఓ వర్గానికి చెందిన ప్రజలు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు.మసీదు కాంప్లెక్స్ సమీపంలో భారీ స్థాయిలో పోలీసులు పహారా కాస్తున్నారు. సిటీలో కంతల్ స్వేర్ నుంచి గోపాల్ మందిర్ వరకు సుమారు 900 మీటర్ల మేర రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టారు. 2028లో జరిగే సింహస్తా ఈవెంట్ కోసం రోడ్డును సుమారు 15 మీటర్ల వెడల్పుతో విస్తరణ చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో భాగమైన అనేక మతపరమైన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే ఇలాంటి 60 నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు చెప్పారు. కానీ షాహి మసీదుతో పాటు ఖడే హనుమాన్ మందిర్ సమీపంలో ఉన్న మజర్ వల్ల రోడ్డు వెడల్పు కార్యక్రమం నిలిచిపోయింది. షాహి మసీదు శతాబ్దాల నాటి వక్ఫ్ ప్రాపర్టీ అని ఆ వర్గ ప్రజలు వాదిస్తున్నారు. అయితే ఆ మసీదుకు చెందిన ప్రార్థన హాల్, మినార్ ప్రస్తుత విస్తరణలో భాగంగా కూల్చనున్నారు. ఆదివారం నుంచి అక్కడ 2 వేల మంది పోలీసుల్ని మోహరించారు.

దుబాయ్‌లో నెతన్యాహు రహస్య పర్యటన

హమాస్‌పై నివేదికను ఖండించాలని యూఏఈ అధ్యక్షుడికి వినతి!



జెరూసలెం సెప్టెంబర్ 28 (మహాప్రభ)

: ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు రహస్యంగా దుబాయ్‌లో పర్యటించారని ఛానెల్ 12టీవీ స్టేషన్ వెల్లడించింది. ఈ పర్యటన గురించి సమాచారం ఉన్న ఇద్దరు వ్యక్తులు సోమవారం దీన్ని ధ్రువీకరించారు. వారు చెబుతున్న దాని ప్రకారం.. ఇజ్రాయెల్ న్యూస్ పేపర్ హారెట్జ్‌లో ఈ నెల ప్రారంభంలో వచ్చిన నివేదిక చుట్టూ ఈ పర్యటన సాగింది.2023 అక్టోబర్7న ఇజ్రాయెల్ మీద హమాస్ దాడులపై నెతన్యాహును యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ముందే హెచ్చరించారని హారెట్జ్ నివేదికలో ఉన్నది. ఈ నివేదిక నిజం కాదని.. దాన్ని ఖండించాలని యూఏఈ అధ్యక్షుడిని కోరేందుకు నెతన్యాహు వెళ్లారని ఆ ఇద్దరు చెబుతున్నారు. ఇప్పటికే నెతన్యాహు కార్యాలయం ఈ నివేదికను ఖండించింది. సెప్టెంబర్ 27 ఆదివారం వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్టు సమాచారం. వీరిద్దరి చర్చలపై స్పందించేందుకు యూఏఈ విదేశాంగ శాఖ నిరాకరించింది.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న తమిళనాడు సీఎం

ఎన్నికల హామీ మేరకు బంగారు ఉంగరాల పంపిణీ ప్రారంభం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన ప్రతి శిశువుకూ గ్రాము బంగారం

మధురై రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిలో పథకం ప్రారంభం

స్వయంగా చిన్నారులకు బంగారు ఉంగరాలు తొడిగిన సీఎం

మాతృత్వానికి గౌరవ సూచికంగా పథకం అమలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యం

పథకం కోసం రూ.755.83 కోట్లు కేటాయింపు

జూన్ 22 నుంచి పుట్టిన చిన్నారులకు పథకం వర్తింపు

చెన్నై: సెప్టెంబర్ 28 (మహాప్రభ)

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ మరో పథకాన్ని ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి చిన్నారికి ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

మధురైలో పథకం ప్రారంభం

మధురైలోని రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం విజయ్ పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన చిన్నారులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగారు. దీంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

ప్రతి చిన్నారికీ గ్రాము బంగారం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టే ప్రతి శిశువుకు ఒక గ్రాము బంగారంతో తయారు చేసిన ఉంగరాన్ని అందించనున్నారు. ఈ పథకం జూన్ 22 నుంచి జన్మించిన చిన్నారులకు వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

మాతృత్వానికి గౌరవ సూచికగా

మాతృత్వానికి గౌరవం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కూడా ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

రూ.755.83 కోట్ల కేటాయింపు

బంగారు ఉంగరాల పంపిణీ పథకం అమలుకు ప్రభుత్వం రూ.755.83 కోట్లు కేటాయించినట్లు సమాచారం. పథకం కోసం అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

1.28 లక్షల ఉంగరాలు సిద్ధం

పథకం ప్రారంభం నాటికి సుమారు 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. అర్హులైన చిన్నారులకు దశలవారీగా ఉంగరాలను అందించనున్నారు.

థాయ్‌మామన్ తంగ మొతిరమ్ థిట్టమ్'

తమిళంలో ఈ పథకాన్ని 'థాయ్‌మామన్ తంగ మొతిరమ్ థిట్టమ్'గా పిలుస్తున్నారు. తెలుగులో దీని అర్థం 'మేనమామ ఇచ్చే బంగారు ఉంగరం'గా ఉంటుంది. పథకానికి ఈ పేరు పెట్టడం ద్వారా తల్లి, బిడ్డ మధ్య అనుబంధానికి ప్రతీకగా బంగారు ఉంగరాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఎలక్ట్రానిక్స్ ధరలకు రెక్కలు..

- పండగ వేళ వినియోగదారులకు షాక్

-అక్టోబర్ 1 నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరల పెంపు

-ఏసీల ధరలు 5--8 శాతం వరకు పెరిగే అవకాశం

-టీవీలు, వాషింగ్ మెషీన్లపై 3--4 శాతం భారం

-మూడోసారి ధరలు పెంచేందుకు కంపెనీల సన్నాహాలు

-ముడిసరుకుల ధరల పెరుగుదలతో తప్పని పెంపు

-రవాణా వ్యయాలు, కరెన్సీ హెచ్చుతగ్గులు మరో కారణం

-దీపావళి వరకు పాత ధరలకే ఉత్పత్తులు లభించే అవకాశం

-పండగ తర్వాత కొత్త ధరల్లు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మహాప్రభ)

: పండగ సీజన్ ప్రారంభానికి ముందే ఎలక్ట్రానిక్స్ వినియోగదారులకు ధరల పెంపు రూపంలో షాక్ తగలనుంది. ఏసీలు, మొబైల్ ఫోన్లు, ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు అక్టోబర్ 1 నుంచి పెరిగే అవకాశం ఉంది. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను 3 నుంచి 8 శాతం వరకు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాదిలో ధరల పెంపు చేపట్టడం ఇది మూడోసారి కావడం గమనార్హం. అల్యూమినియం, రాగి, ఉక్కు వంటి ముడిసరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా



ఖర్చులు అధికమవడం ధరల పెంపునకు ప్రధాన కారణాలుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కరెన్సీ మారకం విలువల్లో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు కూడా కంపెనీల వ్యయాలపై ప్రభావం చూపుతున్నట్లు పేర్కొంటున్నాయి.

ఏసీలపై అధిక భారం..

ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. బ్లూస్టార్, గోద్రెజ్, హయర్, డైకిన్ వంటి సంస్థలు ఇప్పటికే ధరల పెంపును ప్రకటించినట్లు తెలుస్తోంది. ఎల్జీ, వోల్టాస్, హిటాచీ బ్రాండ్ల ఏసీలను విక్రయించే బాష్ హోమ్ కంఫర్ట్ కూడా సుమారు 5 శాతం ధరలను పెంచినట్లు సమాచారం. ముడిసరుకుల ధరలు పెరగడంతో ధరలు పెంచక తప్పడం లేదని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు.

రాగి ధరల ప్రభావం..

గత ఏడాదితో పోలిస్తే రాగి ధర గణనీయంగా పెరిగిందని, దీంతో ఏసీల ధరలను సుమారు 5 శాతం పెంచుతున్నామని హయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్.ఎస్.సతీష్ పేర్కొన్నారు. టీవీలు, వాషింగ్ మెషీన్ల ధరలు కూడా 3 నుంచి 4 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

దీపావళి వరకు పాత ధరలే..?

అయితే ధరల పెంపు వెంటనే వినియోగదారులపై పూర్తిస్థాయిలో ప్రభావం చూపకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. డీలర్ల వద్ద ఇప్పటికే ఉన్న పాత స్టాక్ మరో నెల నుంచి నెలన్నర వరకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో దీపావళి వరకు కొన్ని ఉత్పత్తులు పాత ధరలకే లభించే అవకాశముంది. ఆ తర్వాత కొత్త ధరలు మార్కెట్‌లో పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నిర్భయ ఘటన రోజులు గుర్తుకొస్తున్నాయ్!

ఢిల్లీ-ఎన్‌సీఆర్ మైనర్లపై అత్యాచారం ఘటనలపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ సెప్టెంబర్ 28 (మహాప్రభ)

ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో ఇటీవల మైనర్ బాలికలకు సంబంధించి జరిగిన మూడు లైంగిక దాడి కేసులపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసుల స్పందన కోరింది. గ్రేటర్ నోయిడా-ఢిల్లీ బస్సు, ఆస్థా కుంజ్ పార్క్, స్వరూప్ నగర్‌లో జరిగిన లైంగిక దాడి ఘటనలకు సంబంధించిన కేసులను పరిగణనలోకి తీసుకుంటూ న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది.ఈ ఘటనలు 2012 నాటి నిర్భయ కేసు జ్ఞాపకాలను తిరిగి గుర్తు చేస్తున్నాయని, ఆ ఘటన నుంచి ఏవైనా పాఠాలు నేర్చుకున్నామా లేదా అనే ప్రశ్నను



లేవనెత్తుతున్నాయని జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2012లో ఢిల్లీలో నడుస్తున్న బస్సులో నిర్భయ అని వ్యవహరించే 23 ఏండ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె తర్వాత చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది.

రకూల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు

-రకూల్‌తో పాటు మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు
-ఫిల్మ్ ప్రాజెక్టుల నిధుల మళ్లింపుపై ఆరా
-విదేశీ లావాదేవీలను పరిశీలిస్తున్న ఐటీ అధికారులు
-డాక్యుమెంట్లు, ఆర్థిక రికార్డుల తనిఖీ
-నిర్మాత వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్ ప్రాంగణాల్లోనూ సోదాలు



ముంబై

బాలీవుడ్ నటి రకూల్ ప్రీత్ సింగ్ తో పాటు ఆమె మామ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్‌తో పాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఇవాళ ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. నిధుల తరలింపులో అక్రమాలు చోటుచేసుకున్న కోణంలో ముంబై ఇన్‌కం ట్యాక్స్ శాఖ ఈ సోదాలు చేపడుతున్నది. ఫిల్మ్ ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో విదేశాలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముంబై ఐటీశాఖకు చెందిన పలు బృందాలు.. ఇవాళ ఈ కేసులో డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రికార్డులను పరిశీలిస్తున్నాయి.ఓవర్‌సీస్ లావాదేవీల గురించి కూడా ఐటీశాఖ ఆరా తీస్తున్నది. గత ఏడాది డిసెంబర్‌లో రకూల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ కోసం ఓ డ్రగ్ కేసులో పోలీసులు గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. 2025, డిసెంబర్ 19వ తేదీన డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పోలీసులు ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 43 గ్రాముల కొకైన్, 11.5 గ్రాములు ఎండీఎంఏను సీజ్ చేశారు. అయితే ఈ కేసులో ఆ ఇద్దరు పెడ్లర్ల నుంచి అమన్ అయిదు సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయి.

తెలంగాణలో కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్

(మొదటి తరువాయి)

అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విజేతలను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు లైసెన్స్ తీసుకోకపోతే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్ లో స్పష్టం చేశారు. ప్రాంతాన్ని బట్టి వార్షిక బార్ ఎక్సైజ్ ట్యాక్స్ ను (బీఈటీ) నిర్ణయించారు. టీసీయుఆర్ పరిధిలోని బార్లకు రూ.44 లక్షలు, బోధన్ వంటి కొన్ని ప్రాంతాలకు రూ.42 లక్షలు, మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.30 లక్షలుగా రుసుము ఖరారు చేశారు. ఈ 41 కొత్త బార్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.14.62 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.
ఈ నోటిఫికేషన్ ద్వారా దేవరకద్ర, ఎల్లంపల్లి, మద్దూరు, గుమ్మిడిదల వంటి ప్రాంతాల్లో తొలిసారిగా బార్లు ఏర్పాటువుతున్నాయి. వీటితో పాటు చేవెళ్ల, మొయినాబాద్, కొడంగల్, పరిగి, అశ్వారావుపేట, కల్లూరు, మక్తల్, నర్సంపేట, స్టేషన్ ఘన్ పూర్, ములుగు వంటి పలు మున్సిపాలిటీల్లోనూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా సుమారు 1,185 బార్లు ఉండగా, ఒక్క హైదరాబాద్ లోనే 657 బార్లు ఉన్నాయి.

తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు

(మొదటి తరువాయి)

తెలంగాణ రాజకీయాలు, విద్య, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, డీలిమిటేషన్, ఎన్నికల ప్రక్రియల గురించి చర్చించారు. అలాగే తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంపైనా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు ప్రస్తుతం నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాల్సిన అవసరం ఉంది. చదువు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి చేరుకున్నారు. చదువుకోవడం వల్లే మన్మోహన్ సింగ్ ప్రధాని స్థాయికి, అబ్దుల్ కలాం రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించడమే మా మొదటి ప్రాధాన్యం. అందుకే ప్రైవేటుకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం. సర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను, ఆ తర్వాత స్కిల్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం అని తెలిపారు.
తెలంగాణలో విద్యార్థి సంఘాల ప్రభావం తక్కువ. రాష్ట్రంలో లెఫ్ట్, రైట్ విద్యార్థి సంఘాలు మాత్రమే ఉన్నాయి. ఎస్ఎఫ్ఐయూఐ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తరాది, దక్షిణాదిలో రాజకీయాల శైలి భిన్నం. ఏబీవీపీలో గెలిచిన విద్యార్థి నేతలు ఆ తర్వాత కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ యూనివర్సిటీ, గ్రామ రాజకీయాలు వేర్వేరు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుంది. 2006లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జెడ్పీటీసీగా గెలిచా. 2007లో స్వతంత్ర ఎమ్మెల్యేగా విజయం సాధించా. రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించా. అప్పట్లో తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ రెండు పార్టీలే ఉండేవి. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని టీడీపీలో చేరా. టీడీపీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా. 2017లో కాంగ్రెస్‌లో చేరా. 2019లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించా. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ ప్రాధాన్యం తగ్గింది. ఏపీలో టీడీపీ నాయకత్వం ఉండటంతో తెలంగాణలో పార్టీ బలహీనపడింది. ప్రజల సూచనతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీని తొలిసారి కలిసినప్పుడు 15 నిమిషాలు మాట్లాడా. ఆ రోజే రాహుల్ గాంధీని నాయకుడిగా నిర్ణయించుకున్నా.
ఆయనకు వ్యక్తిగత ఎజెండాలు లేవు..
దేశమే ముఖ్యం. 2014 తర్వాత తెలంగాణలో పోటీ కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారింది అని స్పష్టం చేశారు. కేసీఆర్ నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా. అప్పట్లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రం, ఏపీలో ఎన్డీయేతో పోరాడాల్సిన పరిస్థితి. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేష్ నా శ్రేయోభిలాషులు. విద్యార్థి సంఘం, టీడీపీ, కాంగ్రెస్ నేను ఎక్కడ ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో కొనసాగుతున్నా' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

యూపీఐ చార్జీలపై వివరణ ఇవ్వండి

-కేంద్రాన్ని కోరిన సుప్రీం కోర్టు
- స్టే ఇచ్చేందుకు నిరాకరణ
- ఛార్జీలకు చట్టబద్ధత ఏంటని ప్రశ్నించిన సుప్రీం
- ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా నోటీసులు జారీ
- నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ

యూపీఐపై ఎండీఆర్ ఛార్జీలు విధించడాన్ని సమర్థిస్తూ వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఈ ఛార్జీలు విధించడానికి ఉన్న కారణాలను వివరిస్తూ నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. కేంద్రంతో పాటు ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న ఎండీఆర్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.
యూపీఐ ద్వారా వ్యాపారులకు వ్యక్తులు చేసే 2 వేలకు పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీలు విధించనున్నారు. ఇది అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తుంది. వ్యక్తుల నుంచి వ్యక్తులకు జరిగే లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ఇవి ఉచితంగానే కొనసాగుతాయి. 2 వేల రూపాయలకు పైబడిన నిర్దిష్ట యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉన్న చట్టపరమైన, విధానపరమైన ఆధారాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీం సోమవారం నాడు కోరింది.
యూపీఐ ఛార్జీలపై న్యాయవాది అంజన్ దత్తా దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయసూర్య బాగ్చి, వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలు విధించేలా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సెప్టెంబర్ 14, 5వ తేదీల్లో జారీ చేసిన నోటిఫికేషన్లను పిటిషనర్ సవాల్ చేశారు. అధికారికంగా చేసిన నోటిఫికేషన్ ప్రకారం వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే 2 వేల రూపాయలకు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను, 75 వేలకు పైబడిన లావాదేవీలపై గరిష్ఠంగా 300 రూపాయలు ఎండీఆర్ విధిస్తారు.
ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్. వెంకటరామన్ హాజరయ్యారు. ఈ ఛార్జీలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తాయని, 96 శాతం లావాదేవీలు ఛార్జీల పరిధిలోకి రావని ఆయన కోర్టుకు వివరించారు. నిత్యవసర సేవలకు ఎండీఆర్‌ను 5 రూపాయలకు పరిమితం చేసినట్లు కోర్టుకు తెలిపారు. ఇది పన్నా, లేక రుసుమా ఒక వేళ రుసుము కాకపోతే, ఈ స్వచ్ఛందానికి కార్యాచరణక ఆధారం ఏంటని న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. కోర్టుకు ఈ వాస్తవాలు అఫిడవిట్‌లో కావాలని, ఇది ఎక్కువగా సాంకేతిక సమస్యగా ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.
ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చి ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 269ఎస్‌యును ప్రస్తావించారు. ఈ సెక్షన్ ప్రకారం నిర్దిష్ట టర్నోవర్ ప్రమాణాలను చేరుకున్న కొన్ని వ్యాపారాలు వినియోగదారులకు కొన్ని వ్యాపారాలు వినియోగదారులకు ఎలక్ట్రానిక్ చెల్లింపు సౌకర్యాన్ని అందించాలి. 269 బదిలీని అనుమతిస్తోందని, డెలివరీదారుడి నుంచి నగదు వెళ్లే ఈ రసీదు స్వభావం ఏంటని ప్రశ్నించారు. యూపీఐలో అది ఎవరికి అందుతుంది అని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీని చట్టపరమైన మూలం ఏంటని జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. ఈ ఛార్జీల వల్ల ప్రభుత్వానికి ఏమీ రాదని, చెల్లింపుల వ్యవస్థలో బ్యాంకులు, చెల్లింపు అగ్రిగేటర్ల మధ్య ఈ మొత్తం పంచుకునే ఒక సెటిల్‌మెంట్ ఫీజుగా ఉంటుందని ఏఎస్‌జీ వివరించారు. యూపీఐ వ్యవస్థ పనితీరుకు మద్దతు ఇచ్చే దానికి ఛార్జీలు అవసరమని కేంద్రం వాదించింది. ఈ ఛార్జీలకు చట్టపరమైన ఆధారం ఏంటని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ కేసులో ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

టోల్ బూత్‌లకు గుడ్‌బై.. ఇక నాన్‌స్టాప్ జర్నీ!

టోల్ ప్లాజాల వద్ద ఇక పడిగాపులు అవసరం లేదు
మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానానికి శ్రీకారం
వాహనాలు ఆగకుండానే టోల్ వసూళ్లు
ఫాస్టాగ్‌తోపాటు నంబర్ ప్లేట్ స్కానింగ్
ఆర్ఎఫ్ఐడీ, కెమెరాలు, సెన్సర్లతో ఆటోమేటిక్ టోల్
ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకున్నా నంబర్ ప్లేట్‌తో గుర్తింపు
తెలంగాణలో 11 టోల్ ప్లాజాలకు కొత్త విధానం
టెండర్ల ప్రక్రియలో ఎన్‌హెచ్ఏఐ, ఐహెచ్ఎంసీఎల్
మరో ఐదారు నెలల్లో అమల్లోకి వచ్చే అవకాశం
గుజరాత్‌లో ప్రయోగం.. ఇతర రాష్ట్రాలకు విస్తరణ



హైదరాబాద్

జాతీయ రహదారులపై ప్రస్తుతం ఫాస్టాగ్ విధానంలో కూడా వల్ల టోల్ బూత్ల వద్ద వాహనాలు ఆగి ముందుకు కదలాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. పండుగ సెలవు దినాల్లో సొంతూర్లకు వెళ్లే వారితో రోడ్లపై వాహనాల రద్దీ ఉంటుంది. అలాంటి వేళల్లో టోల్ బూత్ల వద్ద వాహనదారులు వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ఇక ఈ సమస్యకు చెక్ పెట్టడమే లక్ష్యంగా.. మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానం తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా టోల్ వసూళ్లలో కొత్త అధ్యాయానికి కేంద్రం శ్రీకారం చుడుతుండగా.. తెలంగాణలోనూ ఈ సిస్టమ్ అమల్లోకి రాబోతోంది. రాష్ట్రంలోని 11 టోల్ ప్లాజాల్లో మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానాన్ని ఏర్పాటు చేసేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో ఐదారు నెలల్లో కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
ప్రస్తుత టోల్ విధానానికి స్వస్తి : ఇక టోల్ ప్లాజా దగ్గర కనిపించేది సాంప్రదాయ బూత్ కాదు.. ప్రతి లేన్ గ్యాంట్రీలకు ఆర్ఎఫ్ఐడీ రీడర్లు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు, సెన్సార్లు, రాడార్, లిడార్ తదితర పరికరాలు అమర్చుతారు. వాహనం గ్యాంట్రీ కింద నుంచి వెళ్లగానే.. దాని ఫాస్టాగ్, నంబర్ ప్లేట్‌ను గుర్తించి స్కాన్ చేసి.. వాహనం వివరాలను గుర్తిస్తాయి. ఆ సమాచారాన్ని నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థకు పంపిస్తాయి. టోల్ మొత్తం ఆటోమేటిక్‌గా పనిచేస్తుంటుంది. ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్ అయినా వాహనం మాత్రం ఆగకుండా ముందుకు ప్రయాణం ముందుకు సాగుతుంది. అంటే.. నో బూత్.. నో బారియర్.. నో వెయిటింగ్.. జస్ట్.. డ్రైవ్ చేయాల్సి ఉంటుంది.
ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోతే : ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోయినా ప్రయాణం చేయవచ్చు. రిఫైడ్ రీడర్ ఫాస్టాగ్‌ను గుర్తించలేకపోయినా.. హై-రిజల్యూషన్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తాయి. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా టోల్ లావాదేవీ నమోదు అవుతుంది. తక్కువ బ్యాలెన్స్ ఉన్నట్లయితే వాహనదారుడికి 24 గంటల గడువు ఇచ్చి ఫాస్టాగ్ రిచార్జ్ చేసుకుని టోల్ చెల్లించే అవకాశం కల్పించే విధానం ఉంటుంది. ఆ గడువులో చెల్లించకపోతే.. ఈ-నోటీస్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.
తెలంగాణలో 11 టోల్ ప్లాజాలు : ఈ కొత్త టెక్నాలజీ తెలంగాణ జాతీయ రహదారులపైనా అడుగుపెట్టబోతోంది. ఇందుకోసం రాష్ట్రంలోని 11 టోల్ ప్లాజాలను ఇందుకోసం ఎంపిక చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. కంపెనీల ఎంపిక ప్రక్రియ పూర్తయితే మరో ఐదారు నెలల్లో కొత్త విధానం అమల్లోకి వచ్చేలా కసరత్తు జరుగుతోంది.
గుజరాత్‌లో ప్రయోగం.. ఇప్పుడు తెలంగాణలో విస్తరణ : ఈ మల్టీలేన్ ఫ్రీ ఫ్లో టోలింగ్ విధానం దేశంలో తొలుత గుజరాత్‌లోని ఎన్ హెచ్ -48పై చోరయాసి టోల్ ప్లాజా వద్ద ప్రయోగాత్మకంగా చేపట్టారు. అక్కడి అనుభవాల ఆధారంగా దేశంలోని మరిన్ని జాతీయ రహదారులపై ఈ విధానాన్ని విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. తెలంగాణతోపాటు రాజస్థాన్.. ఢిల్లీ.. మహారాష్ట్ర.. తదితర ప్రాంతాల్లో దశలవారీగా ఈ విధానాన్ని ప్రవేశ పెడుతున్నారు.

పట్టభద్రులు మన వైపే

(మొదటి తరువాయి)

ఎవరు పోటీ చేసినా గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పనిచేయాలని నేతలకు పిలుపునిచ్చారు.
ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి
పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నేతలు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. తమ కుటుంబ సభ్యులతో పాటు ఆయా జిల్లాల పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.
కాంగ్రెస్, బీజేపీపై యువత, నిరుద్యోగులు, విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజాదరణ తగ్గుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. యువత ఆ పార్టీకి దూరమవుతోందన్న ఆందోళన బీజేపీ అగ్రనేతల్లోనూ ఉందని ఆయన పేర్కొన్నారు.
ఇతర జిల్లాల్లోనూ గెలుపుపై ధీమా
రెండు రోజుల క్రితం వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ఆయా ప్రాంతాల్లో పార్టీ గెలుపుపై నేతలు ధీమా వ్యక్తం చేశారని కేటీఆర్ తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
పార్టీ అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఆయన పట్టభద్రుల ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకున్నారు.

స్థానిక ఎన్నికలపై టీఆర్ఎస్ ఫోకస్

(మొదటి తరువాయి)

సిద్దిపేట, ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు ప్రజల నుంచి వచ్చిన స్పందనపై కవిత ఆరా తీశారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారో, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందో తెలుసుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతిపక్షంగా పార్టీ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక వస్తోందని ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం ఘటనపై పార్టీ స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని కవిత అన్నారు. ఏళ్లుగా రిమ్స్ ఆస్పత్రిని పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఆస్పత్రి సమస్యలపై సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని చెప్పారు. తాను రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించిన తర్వాతే ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ సమస్య ఎదురైనా పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించి వారికి అండగా నిలవాలని కోరారు. ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహిస్తున్న సమావేశాలు బుధవారం వరకు కొనసాగనున్నాయి. మంగళవారం ఉమ్మడి నిజామాబాద్, నల్గొండ జిల్లాల నేతలతో, బుధవారం ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నేతలతో కవిత సమావేశం కానున్నారు.

చలాన్లు కట్టకపోతే కరెంట్ బిల్లుతో కలపండి!



న్యూఢిల్లీ

దేశ వ్యాప్తంగా పేరుకుపోతున్న ట్రాఫిక్ జరిమానాలకు సంబంధించిన చలాన్లపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాఫిక్ జరిమానాలను చెల్లించని పక్షంలో విద్యుత్ బిల్లులకు చలాన్ల మొత్తం జతచేయాలని సూచించింది. అలాగే జరిమానాలు వసూలు చేసేందుకు ఇతర మార్గాలను కూడా అధికారులు పరిశీలించాలని పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సుమారు రూ. 45,000 కోట్ల విలువైన ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు సుమారు రూ. 25,000 కోట్లు వసూలు అయ్యాయి.కాగా, ఇంకా సుమారు రూ.20,000 కోట్లకు పైగా ఈ-చలాన్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. చలాన్ల మొత్తాన్ని వసూలు చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. చలాన్ల కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జేబీ పార్దీవాలా కీలక సూచనలు చేశారు. 'ప్రజలు ట్రాఫిక్ చలాన్లు చెల్లించకపోతే, ఆ మొత్తాన్ని వారి విద్యుత్ బకాయిల బిల్లుకు జతచేయండి. వారు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందే, లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనండి. ఈ దేశంలో ఏదో ఒక మార్గాన్ని మీరు వెతకాల్సిందే' అని అన్నారు. అలాగే చలాన్‌లు పెండింగ్‌లో ఉండే వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల పునరుద్ధరణ నిలిపివేయడం వంటి చర్యలను పరిశీలించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ వాహనాల యాజమాన్య బదిలీని నిరోధించడం, చలాన్‌లు క్లియర్ అయ్యేంత వరకు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయకపోవడం, అలాంటి వాహనాలను పరివాహన్ పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్ చేయడం, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణను నిలిపివేయడం వంటి అంశాలను కూడా పరిగణించాలని సూచించింది. మరోవైపు ఇప్పటికే జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయడం, చెల్లించని చలాన్‌లు ఉన్న వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి నిరాకరించడం వంటి ఇతర చర్యలను కూడా సుప్రీంకోర్టు చర్చించింది. వాహనాలను యాదృచ్ఛికంగా తనిఖీ చేయాలని, చెల్లించని ఈ-చలాన్ ఉన్నట్లయితే, అవసరమైతే అధికారులు దానిని స్వాధీనం చేసుకోవచ్చని కూడా కోర్టు పేర్కొంది. దేశంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకునే పరిష్కారాలను అధికారులు అన్వేషించాలని జస్టిస్ పర్దీవాలా అన్నారు. అయితే చెల్లించని ట్రాఫిక్ చలాన్‌లను విద్యుత్ బిల్లులకు కలపాలన్న ఆలోచన కేవలం ఒక సూచన మాత్రమేనని, అమలు చేయడానికి ఆదేశం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత

న్యూఢిల్లీ

: ఇరాన్ శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ తిరస్కరించడంతోపాటు బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేయడంతో పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇరాన్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో తాము అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు.అమెరికాతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ అది అంతిమ యుద్ధానికి దారితీసినా తాము ఎదుర్కొంటామని అరాగ్చీ అన్నారు. అదే సమయంలో చర్చలకూ తాము సిద్ధమేనని, ఏది జరగాలన్నది ట్రంప్ చేతిలోనే ఉందని అరాగ్చీ చెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రతిపాదనలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరించడంపై ఆయన స్పందించారు. ఈ అంశంపై దౌత్యమార్గాల ద్వారా తమకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదని చెప్పారు. అక్రమంగా ఫ్రీజ్ చేసిన తమ డబ్బులు, ఆస్తులు తమకు కావాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తమ చమురును తాము అమ్ముకోగలిగే పరిస్థితి ఉండాలన్నారు. ఘర్షణలు తగ్గించేలా చర్చలతో పరిష్కారాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాంటప్పుడు తాము హర్మూజ్‌ను తెరిచేందుకు సుముఖంగానే ఉంటామని అరాగ్చీ పేర్కొన్నారు.

మైనార్టీ మండల అధ్యక్షుడిగా ఖలీమ్ నియామకం



పాపన్నపేట, సెప్టెంబర్ 28(మహా ప్రభ)
పాపన్నపేట మైనార్టీ మండల అధ్యక్షుడిగా పాపన్నపేట కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.ఖలీమ్ మియా ను నియమించారు. సోమవారం మెదక్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్,మైనార్టీ జిల్లా చైర్మన్ సూఫీ జానీ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈసందర్భంగా ఖలీమ్ మాట్లాడారు. హస్తం పార్టీ అభివృద్ధికి కార్యకర్తలతో కలిసి సమన్వయంతో పని చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు ఉన్నారు

భగత్ సింగ్ కు ఘన నివాళులు

-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
మాతృభూమి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో తనదైన ముద్ర వేసిన మహా విప్లవకారుడు షహీద్ భగత్ సింగ్ అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. "నా దేశభక్తిని చూసి నా మరణశిక్ష కూడా సిగ్గుపడుతుంది. నేను చనిపోయాక కూడా నా మట్టి నుండి దేశభక్తి వాసనే వస్తుంది" అనే భావనతో దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమైన భగత్ సింగ్ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆ మహా విప్లవకారుడి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆ మహా విప్లవకారుడికి శతకోటి వందనాలు అర్పిస్తున్నానని రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు..

చిరంజీవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి

-- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్28(మహాప్రభ)
సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్--నల్గొండ జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చందంపేట మండలం చిత్రియాల గ్రామ పంచాయతీ సర్పంచ్ చాట్ల చిరంజీవిని సోమవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రమావత్ రవీంద్ర కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.....నల్గొండ జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవి ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.నల్గొండ జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి అని రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి కేతావత్ శంకర్ నాయక్, సర్పంచ్ రమావత్ కిషన్, మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, బాణావత్ భారత, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ మండలం రాంరెడ్డి పల్లిలో గ్రామసభ విజయవంతం

-సర్పంచ్.లపంగి నరసింహ.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
మర్రిగూడ మండలం లో జాతీయ ఉపాధి హామీ పథకానికి వి బి జి రామ్ జి గా పేరు మార్పుపై
రాంరెడ్డిపల్లిగ్రామపంచాయతీలోగ్రామసభనిర్వహించారు. సర్పంచ్ లపంగి నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో పథకానికి సంబంధించిన అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.
ఈ కార్యక్రమంలో మండల ఏ పీ ఓ , ఉపసర్పంచ్ పొగాకు సైదులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాజీరా, ఫీల్డ్ అసిస్టెంట్ సలీమోజు యాదయ్య, మాజీ సర్పంచ్ మల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షులు కారింగు నర్సింహా, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.
గ్రామసభను విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులకు సర్పంచ్ లపంగి నర్సింహా పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఓట్ల చోరీపై కాంగ్రెస్ సమరశంఖం!!

-వనపర్తి కలెక్టరేట్ ముందు మంత్రుల సమక్షంలో హోరెత్తిన భారీ ధర్నా!!
-పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి!!
-జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి.. ఓటు హక్కును కాపాడాలని డిమాండ్!!
-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా!



వనపర్తి సెప్టెంబర్ 28 (మహాప్రభ)
ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ వనపర్తి గడ్డపై సమరశంఖం పూరించింది. 'ఎలక్షన్ చోర్ ఆఫ్ ఇండియా' నినాదంతో సోమవారం వనపర్తి సమీకృత కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖలతో పాటు క్రీడలు--యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్రంగా స్పందించారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ప్రజల తీర్పును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఓట్ల చోరీకి సంబంధించిన అంశాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధారాలతో దేశ ప్రజల ముందుంచుతున్నారని తెలిపారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపునకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి అన్నారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి అర్హులైన పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకుని, ఆయనను పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని మంత్రి పొంగులేటి డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ప్రతి అర్హులైన పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిందేనని స్పష్టం చేశారు. ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో అడ్డుకుంటుందని జూపల్లి పేర్కొన్నారు.

"ఓటర్ల జాబితాతో రాజకీయ ఆటలు వద్దు"
అర్హత ఉన్న ఒక్క ఓటును కూడా తొలగించొద్దు: మంత్రి వాకిటి శ్రీహరి...
ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.
సర్ పేరుతో అర్హులైన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.
ప్రజల చేతిలో ఉన్న ఓటు వజ్రాయుధం లాంటిదని.. ఆ ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని శ్రీహరి స్పష్టం చేశారు.
"ఓటు హక్కుపై కుట్రలను తిప్పికొడతాం"
జ్ఞానేశ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలి:
ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా ప్రక్రియను అడ్డుపెట్టుకుని అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు
చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని, ఎన్నికల సంఘంలో పారదర్శకతను మరింత బలోపేతం చేయాలని కోరారు.
ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని మేఘారెడ్డి స్పష్టం చేశారు.
"ఓటు హక్కును హరిస్తే ఊరుకోం"
డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి నేతృత్వంలో నిరసన
డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని, ఓటర్ల జాబితాలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు
కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, అర్హత కలిగిన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించాలని శివసేనరెడ్డి కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, యువతకు చెందిన అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ సహించబోదని స్పష్టం చేశారు.
అనంతరం నిరసన కార్యక్రమంలో లేవనెత్తిన అంశాలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి తదితరులు అందజేశారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల--పట్టణ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎస్సీ, మైనార్టీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పునరావాస భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఎత్తివేయాలి

దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
చందంపేటమండలంచిత్రియాల రెవెన్యూ పరిధిలోని 206సర్వేనెంబర్లోపునరావసం కింద భూముల పై ఉన్న నిషేదాన్నితక్షణమేతొలగించాలని జిల్లా కలెక్టర్ కు నివేదించామనిప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి తెలిపారు.
నల్లగొండలో జిల్లా కలెక్టర్ కు చిత్రియాలరెవెన్యూపరిధిలోని వివిధ గ్రామాల రైతులతో
మెమొరండాన్నిఅందజేశారు.ఇందులోఛిత్రియలపెమూల.నల్ల శిలమూల గ్రామాల రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూనె వెంకట్ స్వామిమాట్లాడుతూనాగార్జునసాగర్రిజర్వాయర్ముంపు ప్రాంతానికి గురైన వివిధ గ్రామాలకు సంబంధించిన రైతులకు 1972 లో 206 సర్వే నెంబర్ లోని 9,600 ఎకరాల అటవీ భూముల్లో పునరావాసం కింద 2061.28 గుంటల భూమిని రెవెన్యూ



భూమిగా మార్చారు. అందులో 1,240.29 ఎకరాల భూముల్లో పునరావాసం కింద రైతులకు పట్టాలని ఇచ్చారు.తరువాత2007లో 800 ఎకరాల్లో అసైన్డ్ పట్టాలనుఇచ్చారు.వీరందరూ నేటికీసేద్యంచేస్తున్నారు. 2018 సంవత్సరంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో 206 సర్వే నెంబర్ లోని తక్కిన 7,600 ఎకరాల భూముల్లోనలుగురుతహసీల్దారులు, మరికొంతమంది వీఆర్వోలు మూకుమ్మడిగా దొంగ పట్టాలు సృష్టించి స్థానికేతరులకు కూడా ఇచ్చారు. దీనిపై విచారణ జరిపి ఈ కుంభకోణానికి పాల్పడ్డ తహసిల్దారులపై క్రిమినల
చర్యలుతీసుకోబడ్డాయి.ఉరిమిఉరిమిమంగళం మీద పడ్డట్టు 1972లో పట్టాలు తీసుకున్నరైతులకు ఇదొక తీవ్ర అశనిపాతంగా మారిపోయింది. తీవ్రమైన అక్రమాలు జరిగినందున, 206 సర్వే నెంబర్ను పూర్తికా లాక్ చేయడం వల్ల1972లో పునరావాసంకిందభూములు పొందినరైతులహక్కులు పూర్తిగా.కాలరాయపడ్డాయిఅట్టి.భూములక్రయవిక్రయాలు,మ్యూటేషన్లసమస్యలన్నీ పేరుకుపోయాయి.
ఈ.స్థితిలో జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ ఆర్డిఓ తహసిల్దార్లు పునరావాస భూములయొక్కహక్కులను నిలబెట్టేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతాంగం పాల్గొన్నది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన రాజిరెడ్డి

మాసాయిపేట సెప్టెంబర్ 28,(మహాప్రభ)
మెదక్ జిల్లా కేంద్రంలో మాసాయిపేట మండలం పోతాన్ పల్లి గ్రామానికి చెందిన జోడు శ్రీలత భర్త యాదగిరికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.40 వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల వైద్య ఖర్చుల భారం తగ్గించడానికే ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ను అందిస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. అవసరమైన వారు నిరభ్యంతరంగా సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతాన్ పల్లి గ్రామ సర్పంచ్ కవ్వం మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, జిల్లా కార్యదర్శి ఊదండపురం నాగరాజు, సొసైటీ డైరెక్టర్ ఊదండపురం నర్సింలు, సీనియర్ నాయకులు బాలసాయి హరిప్రసాద్, మాసాయిపేట గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మత్స్య శాఖ మెరుగుపడాలి ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి చేరాలి

- కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

మెదక్ సెప్టెంబర్ 28,(మహాప్రభ)
మెదక్ మత్స్యశాఖ ఆఫీసును సందర్శించినటువంటి మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆఫీసు మరియు చాపలు చూసి శిధిల అవస్థలో ఉన్నటువంటి ఆఫీసును పరిశీలించి మరియు 15 ఎకరాలు ఉన్నటువంటి స్థలంలో ఆఫీస్ బిల్డింగ్ కొరకు మంత్రి ఎమ్మెల్యే తోనే మాట్లాడి తప్పకుండా బిల్డింగ్ శాంక్షన్ చేపిస్తానని మాట ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మత్స్యశాఖచైర్మన్ గడప దేవేందర్ మరియు మత్స్య శాఖ సిబ్బంది నరేష్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు కలెక్టర్కు వినత పత్రం..... కలెక్టర్ గారికి వినతి పత్రం ఓట్ చోర్ విషయంలో భారీ ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే రోహిత్ మైనంపల్లి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ ఇంచార్జ్ రాజిరెడ్డి దుబ్బాక ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి మెదక్ చైర్మన్ రాధిక వైస్ చైర్మన్ కౌన్సిలర్స్ జెడ్పిటిసి మాజీలు ఎంపీటీసీ మాజీలు వివిధ గ్రామాల నుండి వచ్చినటువంటి సర్పంచులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాల్గొనడం మెదక్ టౌన్ లోని నిరసన కార్యక్రమం చేయడం జరిగింది



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన దేవరకొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అభిషా





దేవరకొండ సెప్టెంబర్ 28(మహాప్రభ)
నల్గొండ జిల్లా కేంద్రంలో ఇటీవల (అక్టోబర్ 27న) నిర్వహించిన "1వ్ష్ట్ర షాటో ఖాన్ తెలంగాణ స్టేట్ కరాటే శాంపియన్షిప్ " పోటీలలో దేవరకొండ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అభిషా విశేష ప్రతిభ కనబరిచింది.
బ్లాక్ బెల్ట్, అండర్-14 ఇయర్స్ విభాగం కుమితే ఫైటింగ్ పోటీలలో అభిషా అత్యుత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థులపై విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో పతకం సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తెచ్చిన అభిషాను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కలమ్మ, ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల యాజమాన్యం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎమ్/ప్రిన్సిపాల్ కలమ్మ మాట్లాడుతూ --- 'ప్రస్తుత సమాజంలో మహిళలు మరియు బాలికలకు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు (- సెల్ఫ్ డిఫెన్స్) ఎంతగానో అవసరం. తమను తాము రక్షించుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్క బాలిక కరాటే నేర్చుకోవాలి. ప్రతి మహిళా రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలా ధైర్యసాహసాలతో తయారవ్వాలి" అని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థినికి అత్యుత్తమ శిక్షణ అందించి విజేతగా తీర్చిదిద్దిన కరాటే మాస్టర్స్ స్సీనియర్ మాస్టర్ శ్రీను ని మాస్టర్ ఆకాష్ ని, వారి కృషిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా కొనియాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్



దేవరకొండ, సెప్టెంబర్ 28: (మహాప్రభ)
ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో షాహిద్ భగత్‌సింగ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన త్యాగాలు, ఆయన పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థులు, యువతకు ఆదర్శమని అన్నారు. భగత్‌సింగ్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ నిర్మూలన కోసం పోరాడిన విప్లవకారుడని పేర్కొన్నారు.భగత్‌సింగ్ ఆశయాలను నేటి తరానికి చేరువ చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. కుల, మత,ప్రాంతీయ వివక్షలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యంగా నిలవాలని అన్నారు.ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, భగత్‌సింగ్ చూపిన పోరాట మార్గంలో విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. భగత్‌సింగ్ ఆశయాలు వర్ధిల్లాలని, విద్యార్థి ఉద్యమం బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, నేతాల జయరాం,ఏన్నుపోతుల పరమేష్, నాగరాజు, శివ, అశోక్,అభిషేక్, భారత్,అజయ్,సంపత్, శ్రీకాంత్, ప్రేమ్,సాయిరాం ఆంజనేయులు,చలపతి, అశ్వంత్,భాను, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర వీరప్పయ్య స్వామి సన్నిధిలో అన్నదానం..

-భక్తులకు అన్నప్రసాద వితరణ



దేవరకద్ర, సెప్టెంబర్ 28:. (మహాప్రభ)
దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.
స్వామివారి సన్నిధిలో అన్నదానం చేయడం పుణ్యప్రదమనే భక్తిభావంతో దాతలు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమినోళ్ల గోత్రానికి చెందిన శ్రీమతి శాలి నరసమ్మ కుమారుడుశాలి సతీష్‌కుమార్, ఆయన ధర్మపత్ని శాలి అనూష దంపతులు అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. స్వామివారి ఆశీస్సులతో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో శివానంద చారి, అర్చకులు నాగరాజు స్వామి, భూషణ్ స్వామి పాల్గొన్నారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా నీరుకంటి శ్రీశైలం

-గ్రామస్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలి

-అక్టోబర్ 7న అమరావతిలో జాతీయ సదస్సు.. విజయవంతం చేయాలని పిలుపు

దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
దేవరకొండలో మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం ఆర్ పి ఎస్) సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా దేవరకొండ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దేవరకొండ మండల కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆవరణంలో నూతన మండల కమిటీ ఎన్నికసమావేశంనిర్వహించారుఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా నీరుకంటి శ్రీశైలం మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఎం ఆర్ పి ఎస్ , ఎం ఎస్ పి జిల్లా నాయకులు పండ్ల గోపి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ



సమావేశానికి ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, దేవరకొండ మండల ఇన్‌చార్జి బొజ్జ చిన్న మాదిగ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.అక్టోబర్ 7న అమరావతిలోనిర్వహించనున్న ఎం ఆర్ పిఎస్జాతీయ సదస్సును విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీలను పటిష్టం చేయాలని, గ్రామ కమిటీల ఏర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.
అనంతరం దేవరకొండ మండల నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నీరుకంటి శ్రీశైలం మాదిగ, అధికార ప్రతినిధిగా నల్ల రాజు మాదిగ, ఉపాధ్యక్షులుగా పులిజాల మల్లేష్ మాదిగ, ముదిగొండ మహేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కుక్కముడి శ్రీనయ్య మాదిగ, సంయుక్త కార్యదర్శులుగా కుక్కముడి దేవదానం మాదిగ, గడుసు చిన మహేష్ మాదిగ, కార్యదర్శులుగా నల్ల సైదులు మాదిగ, గండు వెంకటేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు నల్ల వెంకటయ్య మాదిగ, మాతంగి కాషయ్య మాదిగ, సలికినేని జీవ, సందగళ్ల వీరయ్య మాదిగ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్జిగల్ల మురళీకృష్ణ మాదిగ, దేవరకొండ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి సలికినేని రామకృష్ణ మాదిగ, కుక్కముడి అంజయ్య, పేర్ల శ్రీకాంత్, మంద చంద్రయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలి

--దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ తమ ఎమ్మెల్సీ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటరు జాబితా రద్దైన నేపథ్యంలో పాత ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన పట్టభద్రులు అందరూ తప్పనిసరిగా మళ్లీ తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ కొనసాగిస్తున్న ప్రజా పోరాటాలను పట్టభద్రులు గమనించాలని రవీంద్ర కుమార్ అన్నారు. ప్రజా సమస్యలపై రాజకీయ పార్టీల వైఖరి, వారి పనితీరును పరిశీలించి ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.ఉమ్మడి నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటు నమోదు కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులు, నిరుద్యోగ యువత, వ్యాపారులు, ఇతర రంగాల్లో ఉన్న పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని రవీంద్ర కుమార్ కోరారు.ఓటు హక్కు మన బాధ్యత.. మన భవిష్యత్తుకు మన నిర్ణయం అనే స్ఫూర్తితో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటు హక్కును కాలరాస్తే సహించం

-సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి

-దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 28 మహాప్రభ
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్), జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నినాదాలు చేస్తూ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటిదని, అలాంటి వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే పరిస్థితులు రాకుండా రాజ్యాంగబద్ధమైన సంస్థలు స్వతంత్రంగా,



పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తోందని ఆయన ఆరోపించారు.
ఎన్నికల ప్రక్రియ అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వేదిక కాకుండా ప్రజల తీర్పును ప్రతిబింబించేలా ఉండాలని జీఎంఆర్ అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కనపెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన దర్యాప్తు కథనం ప్రకారం.. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. వీటిలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, ఫారం-6లో మార్పులు, ఓటర్ల జాబితా నిర్వహణ తదితర అంశాలు ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది.
ఈ పరిణామాలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని జీఎంఆర్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దేవరకద్ర నియోజకవర్గంలో చిన్నచిన్న కారణాలు చూపుతూ సుమారు 73 వేల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చి భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని జీఎంఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడే ఎస్టి కమిషన్ జాతీయ సభ్యుడు వనపర్తికి రాక!!

వనపర్తి సెప్టెంబర్ 28 (మహాప్రభ)
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ రేపటి పర్యటన నేపథ్యంలో బిజెపి జిల్లా కోర్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ రేపు వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండలం వెనికి తండాలో హుస్సేన్ నాయక్ పర్యటన ప్రారంభమవుతుందని ఖిల్లా గణపురం లో ఉన్న గిరిజనుల భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోనున్నారని



అనంతరం పెద్దమందడి వనపర్తి పానుగల్ మండలాలలో గిరిజన సమస్యలపై ప్రజలతో ముఖాముఖి చర్చల్లో పాల్గొననున్నారని మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్టీల సమస్యలపై అధికారిక రివ్యూ సమావేశం జరగనున్నదని కావున ఈ యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్క గిరిజన సోదరుడు వినియోగించుకొని తమ తమ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకురావాలని అదేవిధంగా జిల్లాలోని మండల అధ్యక్షులు గిరిజన సోదరులతో సమన్వయం చేసి ఎస్టి కమిషన్ సభ్యుల పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు మున్నూరు రవీందర్ సబిరెడ్డి వెంకటరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శ్రీశైలం ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి కేతూరి బుడ్డన్న జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు ఎస్టి మోర్చా అధ్యక్షులు రవి నాయక్ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేదక్‌లో కాంగ్రెస్ నిరసన.

- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్.

-మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మల దహనం.

-ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో ధర్నా

-యస్ ఐ ఆర్ ప్రక్రియపై పారదర్శకత, ఓటర్ల జాబితాపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్.



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ).

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టి పి సి సి)అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా మేదక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వం వహించగా, మేదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. అంజనేయులు గౌడ్ పర్యవేక్షించారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (యస్ ఐ ఆర్). ప్రక్రియకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. సెప్టెంబర్ 28న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని టి పి సి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యస్ ఐ ఆర్ ప్రక్రియ, ఓటర్ల డేటాలో మార్పులు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.మేదక్‌లో జరిగిన ధర్నాలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, డేటాలో మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాల్లో అనుసరిస్తున్న విధానంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కానుగ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, టౌన్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఫాజిల్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాహెర్, మేదక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, హవేలీ ఘన్‌పూర్‌కు చెందిన కిరణ్ గౌడ్, మేదక్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్ గౌడ్తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యస్ ఐ ఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ పారదర్శకత, సమగ్ర వివరణ కోరుతుండగా, ఎన్నికల సంఘం మాత్రం యస్ ఐ ఆర్ కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నట్లు పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ధర్నా సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులను పరిరక్షించడంతో పాటు ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు.

మెదక్ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తాం

-9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్.



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ).

మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం లో ఎమ్మెల్యే రోహిత్ రావు ముఖ్య అతిథిగా, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ వార్డులోని సమస్యలతో పాటు మెదక్ పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మెదక్ పట్టణ ప్రజలు వాకింగ్, పోలీస్ శిక్షణ కోసం ఉపయోగించుకునే అథ్లెటిక్ స్టేడియంలో పరిశుభ్రత, టాయిలెట్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి చేసి పిల్లలకు ఆటస్థలంగా, మహిళలకు వాకింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.అలాగే చిల్డ్రన్స్ పార్క్ వెనుక నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాలో ప్రారంభం నుంచి వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో లేవని, ప్రజలకు వైద్య సేవలు అందేలా వెంటనే దవాఖానాను ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. 9వ వార్డులో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే రోహిత్ రావు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మెదక్ పట్టణ అభివృద్ధి కోసం చేపట్టే పనులకు పార్టీలకతీతంగా పూర్తి సహకారం అందిస్తామని జుబేర్ అహ్మద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

కస్తూరిబా బాలికల విద్యాలయంలో సేవా సంకల్ప్ అభియాన్

-బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ).

(బీజేవైఎం) అధ్యక్షుడు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో కస్తూరిబా బాలికల విద్యాలయంలో భారతీయ జనతా పార్టీ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెత్త ను క్లీన్ చేసి కలుపు మొక్కలు తీసివేసి ఇబ్బందికర మొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బిజెపి జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు,మెదక్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు సాయిబాబా , నర్సింగరావు ఉపాధ్యక్షుడు శశికాంత్ , సన్నీ కార్యదర్శి హర్షవర్ధన్ నవీన్ గౌడ్ పవన్ బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శిలు, నల్లాల విజయ్,యం ఎల్ ఎన్ రెడ్డి, బిజెపి మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యులు లోకబోయిన లోకేష్, అల్లం మధు, 21 వార్డ్ కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్ బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు సతీష్, కార్మిక శాఖ సెల్ కన్వీనర్ శ్యామయ్య, వాణిజ్య విభాగం జిల్లా కన్వీనర్ బిక్షపతి, అంకం శ్రీనివాస్,వేణు, తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్ మిలాన్ కార్యక్రమం

-సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ).

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా సోమవారం అంగన్ మిలాన్ కార్యక్రమం పట్లోళ్ళ మల్లిక అశోక్ అధ్యక్షతన నిర్వహించిన అంగన్ మిలాన్ కార్యక్రమంలో భాగంగా అఖిల భరత్ ఆధ్వర్యంలో ఈరోజు అంగన్వాడి టీచర్ ఆయమ్మ మరియు ఆశా కార్యకర్తకు ఆర్ పి కి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పేద మధ్యతరగతి కుటుంబాలకు వారి పిల్లలకు విద్య ఆటపాటలు నేర్పుతూ వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పాలు గుడ్లు, పౌష్టిక ఆహారము అందించటంతో పాటు వారి యొక్క ఎదుగుదలను వార వారము గుర్తించడము గర్భిణీ స్త్రీలకు బాలింతలకు వారు ఆహారము పాలు గుడ్లు అందించి వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వాటిని గమనించి అంగన్వాడి టీచర్ వారి ఆలనా పాలన చూస్తారని.ఆశా కార్యకర్తలు పిల్లల ఆరోగ్య పరిస్థితిని,గర్భిణీల పర్యవేక్షణలో ప్రసూతి కి సంబంధించిన వాటి ని చూసుకుంటారని కేంద్ర ప్రభుత్వం గుర్తించి వారికి ఘనంగ సత్కరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, మల్లికా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి , సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు నాయిని ప్రసాద్, 21 వార్డ్ కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్, బాలానగర్ సర్పంచ్ మెదక్ రూరల్ మండలాధ్యక్షులు బెండవీన, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సౌజన్య, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం ఎల్ యన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సన్నీ,చైతన్య,కిషాన్ మోర్చ నాయకులు శేఖర్, తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్.



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ).

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు నశా ముక్త్ యువ భారత్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను తెలిపారు. దేశాన్ని మాదకద్రవ్యాల (డ్రగ్స్) రహితంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ ఉద్యమమే "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్". ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 ఆగస్టు 2న ప్రారంభించారు. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను చేయడం, వారిని వ్యసనాలకు దూరంగా ఉంచడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం, యువకులలో ఆరోగ్యకరమైన జీవనశైలిలో మార్పులకై వారిలో సృజనాత్మకను డెవలప్ చేయడం, క్రీడలు, సంస్కృతి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడం ఈ ప్రోగ్రాం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి యువకులు ఆరోగ్యంగా వుండాలని, ఆరోగ్యవంతమైన విద్యార్థులు సమాజానికి, దేశానికి వరమని, యువకులలో నైతిక విలువలు పెరగాలని, క్రమశిక్షణ అభివృద్ధికి నిచ్చెన మెట్టని, చదువే విద్యార్థికి ముఖ్య ఉద్దేశ్యంగా వుండాలని, చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా వుండాలని, తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని, తినీతినక, పస్థులుండి, అప్పులు చేసి చదివిస్తున్నారని, విద్యార్థులు మంచి క్రమశిక్షణతో వుండి వున్నత చదువులు చదవాలని, డ్రగ్స్,మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, మంచి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని, ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే పూర్తిగా దానికి బానిసలై పోతారని, శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా చాలా నష్టపోతారని, ప్రతి ఒక్కరు ఏదో ఒకటి సాధించడానికి పుట్టారని, విద్యార్థులు విలువైన జీవితాన్ని జీవించాలని, ఏది సాధించాలన్నా విద్యార్థుల యవ్వన దశే కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు. చివరగా విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

రవాణా సౌకర్యం కల్పించండి

- తిప్పారం తండా గ్రామ ప్రజలు



గాంధారి: సెప్టెంబర్ 28 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా, గాంధారి మండలం తిప్పారం తండా, పరిసర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రోడ్లపై ఇతరుల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. గాంధారి నుండి సోమవారం, కొత్తవాడి మీదుగా పెద్ద గుజ్జులు, పిస్కిల్ గుట్ట వరకు 13 గ్రామాల్లో దాదాపు 80 మంది విద్యార్థులు నష్టపోతున్నారు.ఈ మేరకు కామారెడ్డి బస్ డిపో మేనేజర్ కు రెండు నెలల్లో మూడుసార్లు వినతిపత్రం అందజేశామని మాజీ సర్పంచ్ బిషన్ నాయక్, బిచ్చం నాయక్, పెంటయ్య, రమేష్ తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ శంకరయ్యను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జోక్యం చేసుకొని రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. సమస్య పరిష్కరించకుంటే మండల కేంద్రంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

- సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ నాయక్



దేవరకొండ సెప్టెంబర్ 28(మహా ప్రభ)

వికసిత్ గ్రామపంచాయతీ(వి.జి పి. పి.) పనుల ప్రణాళిక. గ్రామసభ సమావేశం మైనంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు..ఈసందర్భంగా సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలి అని అదేవిధంగా రైతులు పారం ఫండ్స్ .ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని కోరారు పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్. వార్డు సభ్యులు కిషన్. నాగరాజు.కొర్ర లక్ష్మీ ప్రశాంత్. కొర్ర సునీత బద్రు. సంతోష వెంకట్.ఫీల్డ్ అసిస్టెంట్ . స్వాతి. ఆశ ధనమ్మ. అలివేలు.అంగన్వాడీ టీచర్లు కమలమ్మ. బుజ్జి.లచ్చి. ఆయా కలమ్మ.వి.పి. ఓ వీరబాబు. శివ.గ్రామస్తులు పాల్గొన్నారు

నిరుపేద సొంతింటి కల.. భూ సమస్యల గోడు..

-దేవరకద్ర 'ప్రజావాణి'లో రెండు దరఖాస్తుల స్వీకరణ: ఎంపీడీవో శ్రీనివాసరావు



దేవరకద్ర: సెప్టెంబర్ 28 మహాప్రభ

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు వివరాలు వెల్లడిస్తూ.. తాజా ప్రజావాణిలో అధికారులకు మొత్తం రెండు దరఖాస్తులు అందాయని తెలిపారు. అందులో ఒకటి గూడు లేని నిరుపేదలు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఉద్దేశించిన 'ఇందిరమ్మ ఇల్లు' కోసం రాగా, మరొక దరఖాస్తు అత్యంత కీలకమైన 'రెవెన్యూ' విభాగం సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. వచ్చిన దరఖాస్తులు తక్కువే అయినప్పటికీ, వాటిలోని సమస్యల తీవ్రతను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. అందిన ఈ రెండు ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



మెదక్ జిల్లా -28సెప్టెంబర్ (మహాప్రభ

ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో లిడి.ఆర్వో అంబ దాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (91)అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో , వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరుకుతుంటే ఇద్దరు వ్యక్తులు అరెస్టు 14 రోజుల జైలు



గాంధారి, సెప్టెంబర్ 28: (మహాప్రభ)
గాంధారి మండలంలోని నాగ్లూర్ గ్రామం బీట్ పరిధిలో టేకు చెట్లు నరుకుతున్న ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు.
చద్మల్ తండా గ్రామానికి చెందిన రామదాస్, హరిదాస్ టేకు చెట్లను నరికి, అటవీ భూమిలో మామిడి సాగు చేసేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు.ఈ ఇద్దరినీ ఎల్లారెడ్డి ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జైలు శిక్ష విధించింది. అనంతరం వారిని నిజామాబాద్ జైలుకు తరలించారు. ఫారెస్ట్ చెట్లను కానీ భూమిని కానీ ఎవరైనా అక్రమంగా వినియోగిస్తే చర్యలు తప్పు అని ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక



గాంధారి సెప్టెంబర్ 28 (మహాప్రభ)
విద్యుత్ వినియోగదారులకు లింగంపేట్ మండల ఉప విభాగం పరిధిలో ఈ నెల 29వ తేదీన 33/11 కేవీ ఎస్.ఎస్.రెడ్డి ఉపకేంద్రంలో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ కె. కిషన్ జవాన్, సభ్యులు (సాంకేతిక) జె.ఆర్. చవాన్, సభ్యులు (ఆర్థిక) పి. శ్రీనివాస్, నాలుగో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారు. కావున విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులు లేదా ఇతర సమస్యలు ఏమైనా ఉంటే ఈ వేదికకు హాజరై తెలియజేయగలరు.

విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నబిప్రజా ప్రభుత్వం కాంగ్రెస్

-వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు
-రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వనపర్తి సెప్టెంబర్ 28 (మహాప్రభ)
సోమవారం వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో రూ. 11.75 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణా పబ్లిక్ స్కూల్, వనపర్తి మండలం చిట్యాల గ్రామ పరిధిలో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జ్యోతిభా పూలే బాలుర గురుకుల కళాశాల భవనానికి సహచర మంత్రులు రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేశారు.బి ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించిన ప్రజా ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే ఈరోజు వెల్టూర్ గ్రామంలో రూ. 11.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణలో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమమైన విద్య అందించలేకపోయామని బాధ కలగకుండా ఈరోజు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పేద ప్రజలు తమకు అనారోగ్యం వచ్చినపుడు మెరుగైన వైద్యము చేయించుకోలేక తమ వారు ప్రాణాలు కోల్పోయారని బాధపడకుండా తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రార్ధన తెచ్చి కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుంది అన్నారు. తమ ప్రభుత్వంలో రైతులను రాజు చేయాలానే ఉద్దేశంతో ఈరోజు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు నిరుద్యోగ యువతకు ఇప్పటికే వేలాది ఉద్యోగాలు ఇవ్వడంతో పాటుగా కొత్తగా మరికొన్ని వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో 70 వేల కోట్ల రూపాయలు సున్నా వడ్డీకే రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.
గత పాలకులు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి పోయినప్పటికి, గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అమలు చేస్తూనే ఈ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చందుకు కృషి చేస్తుందన్నారు. స్థానిక శాసనసభ్యులు తుడి మెగారెడ్డి అభ్యర్థన మేరకు వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు ఇవ్వడంతోపాటు కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాల్సిన ఉందని, వాటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెల్టూరులో రూపాయలు 11.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.
వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ అతిపెద్ద గ్రామమైన వెల్టూరును మండల కేంద్రం చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.
వనపర్తి పట్టణం నల్ల చెరువులో చేప పిల్లల విడుదల
రాష్ట్ర వ్యాప్తంగా వనపర్తి లోనే చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రులు వనపర్తి జిల్లా వనపర్తి పట్టణం నల్ల చెరువులో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించి, చేప పిల్లలను నీటిలో విడుదల చేశారు ఈ చేప పిల్లల కార్యక్రమాన్ని ఈ సీజన్లో రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా అనుకొనపర్తిలో ప్రారంభించినట్లు మంత్రులు పేర్కొన్నారు .వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంత్రులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు

ప్రజాస్వామ్య దృశ్యంజ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి

- కళ్ళకు నల్లగంతలతో సిపిఐ నిరసన



వనపర్తి సెప్టెంబర్ 28 మహాప్రభ
కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, ప్రముఖ కవి జనజ్వాల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం అంబేద్కర్ చౌక్ లో కళ్ళకు నల్లగంతలు, ఎర్రజెండాలతో అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ లో ముగ్గురు సభ్యులు ఉండగా జ్ఞానేశ్వర్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకువటం దారుణం అన్నారు. ముగ్గురు సభ్యులు లో ఒకే వ్యక్తి నిర్ణయంపై జరిగిన సర్ ప్రక్రియ సర్ ప్రక్రియ చెల్లదన్నారు. బిజెపికి అనుకూలంగా జ్ఞానేశ్వర్ కుమార్ దేశంలో 13 కోట్ల మంది ఓట్లను తొలగించారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటని జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించి కొత్తవారికి బాధ్యతలు కొత్తవారికి అప్పగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అప్పటివరకు ప్రస్తుత ఎన్నికల జాబితా ప్రకారం ఎలాంటి ఎన్నికలు నిర్వహించరాదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సిపిఐ తెగించి పోరాడుతుందన్నారు. కొత్తవారికి బాధ్యతలు అప్పగించి తరుణ్ మళ్లీ మొదటి నుంచి చేపట్టాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, నేతలు జనజ్వాల రాధాకృష్ణ చిన్న కుర్మయ్య, పృథ్వినాదం, లక్ష్మీనారాయణ, శేఖర్ ,శివ, చందు, జయమ్మ ,జ్యోతి ,వెంకటమ్మ ,నాగమణి,

శివాలయం టీమ్ వారి నిమ్మజన వేడుకల్లో జబర్దస్త్ టీమ్.



మనోహరబాద్, సెప్టెంబర్ 28 (మహాప్రభ)
మెదక్ జిల్లా మనోహరబాద్ మండల కేంద్రంలో శివాలయం ఫ్రెండ్స్ టీం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన వేడుకలు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నిమజ్జన కార్యక్రమానికి జబర్దస్త్ టీమ్ సభ్యులైన విజయభాస్కర్, గడ్డం నవీన్, చిత్రం శ్రీను, చిట్టిబాబు, పంచ్ ప్రసాద్ లు ఆహ్వానించారు. ముందుగా వీరికి మర్యాద పూర్వకంగా అతిథి మర్యాదలు చేశారు. అనంతరం జబర్దస్త్ టీమ్ సభ్యులచే చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నిమజ్జన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, శివాలయం టీం సభ్యులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ

, జైపూర్,సెప్టెంబర్ 28 (మహాప్రభ)
జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం,28.09.2026 న ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.
ఈ సందర్భంగా మొత్తం (04) ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు (01), పంచాయతీ రాజ్ శాఖకు (02) మరియు RWS శాఖకు (01) చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీపతి బాపు రావు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.



హాజరైన అధికారులు:-
1. ఎంపీడీవో శ్రీపతి బాపు రావు
2. మండల తహసీల్దార్ వనజా రెడ్డి
3. మండల వ్యవసాయ అధికారి సైదా
4. ఏఈఈ గ్రిడ్ జే.వినయ్ కుమార్
5. మండల విద్యాధికారి శ్రీనివాస్
6. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏ. వెంకటేష్
7. ఏఈ పిఆర్ బి.రాజ్ కుమార్
8. గర్ల్స్ హాస్టల్ వార్డెన్ సుధలక్ష్మి
9. ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఎన్ .రాజమలయ్య
10. ఏఈ విద్యుత్తు జి.మనోహర్
11. ఐసిడిఎస్ సూపర్వైజర్ గాయత్రి
12. ఏపీవో వీబీగ్రామ్ జి బి.బాలయ్య
13. ఏపీఎం ఐకెపి సిహెచ్ సంతోష్
14. ఏఫ్ బి ఓ వసంత లక్ష్మి
15. ఏ ఈ హౌసింగ్ కాంక్ష.
16. ప్రోహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర రావు

శిథిలావస్థలో మండల ప్రజా పరిషత్ భవనం, రేకుల షెడ్డులోనే అధికారుల విధులు..

ప్రజలకు తప్పని అవస్థలు.



,జైపూర్, సెప్టెంబర్ 28 (మహాప్రభ)
జైపూర్ మండల కేంద్రంలో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన మండల ప్రజా పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితికి చేరుకుంది. దీంతో అధికారులు కార్యాలయ ప్రాంగణంలోని చిన్న రేకుల షెడ్డులో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జైపూర్ మండల కేంద్రానికి వస్తుంటారు. అయితే మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం పరిస్థితిని చూసి “అధికారులకే సరైన కార్యాలయం లేకపోతే.. ప్రజల సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుంది?” అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన కీలకమైన కార్యాలయం ఇలా శిథిలావస్థలో ఉండటంతో అధికారులు, సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.
ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు, నాయకులు కోరుతున్నారు. కొత్త భవనం నిర్మిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు అధికారులకు కూడా సౌకర్యవంతమైన పని వాతావరణం ఏర్పడుతుందని వారు పేర్కొంటున్నారు.

ఒకే భూమి ముగ్గురికి అగ్రిమెంట్


-7 మందిపై కేసు నమోదు



నారాయణఖేడ్ సెప్టెంబర్ 28 (మహాప్రభ)
ఒకే సర్వే నంబర్ భూమిని ఒకరికి తెలియకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన 7మందిపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ..కంగ్టి మండలం ముకుంద నాయక్ తండాకు చెందిన రాజు రాథోడ్,ఆడే రవీందర్,ఆడే చవాన్ రాజ్ పట్టదారులు ఆడే దేవిసింగ్,శంకర్, పండరి,పుండ్లిక్ లు కరీంనగర్ కు చెందిన కోలా రమేష్ అనే వ్యక్తికి గత ఏడాది జూలైలో అదే తండా శివారు సా.చీశే 99 లో 8.10 ఎకరాలు భూమిని అగ్రిమెంట్ చేసి అడ్వాన్స్ గా 31 లక్షల రూపాయలు తీసుకున్నారు అన్నారు.తర్వాత ఆగస్టులో స్లాట్ బుక్ చేయించారని,భూమి రిజిస్ట్రేషన్ చేయమంటే రేపు మాపు అంటూ ఏదో ఒక సాకు చెప్పి దాటవేస్తున్నారని,తర్వాత రమేష్ ను విచారించగా ఇతని కంటే ముందే అదే భూమిపై హైదరాబాద్ కు చెందిన వ్యక్తులకు రెండు అగ్రిమెంట్ లు చేసి డబ్బులు తీసుకున్నారని తెలుసుకుని కోలా రమేష్ అనే వ్యక్తి దరఖాస్తు ఇవ్వగా పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాము అన్నారు.సిర్గాపూర్, కంగ్టి,కల్హేర్ మండలాల పరిధిలో ఎవరైనా ఒకే సర్వే నెంబర్ లో ఒకరికి అగ్రిమెంట్ చేసి,తిరిగి అదే భూమిని ఇతరులకు అగ్రిమెంట్ చేస్తే బాధితులు ఎవరైనా ముందుకు వచ్చి పిర్యాదు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము అన్నారు.

వామ్మో.. ఆ హీరోతో యాక్టింగ్ అంటే భయం..

తెలుగు సినీ పరిశ్రమలో హీరోయిన్ సదా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సుదీర్ఘ సినీ ప్రయాణం, నటన పట్ల తన విలక్షణమైన దృక్పథం, వ్యక్తిగత జీవిత సూత్రాలపై ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆమె తన కెరీర్‌లో ఎదురైన అనుభవాలను, సహనటులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు.తన మొదటి చిత్రం జయం గురించి ప్రస్తావిస్తూ, అది నితిన్, తన జీవితంలో ఒక మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. దర్శకుడు తేజ క్రమశిక్షణను ఆమె గుర్తు చేసుకున్నారు. సెట్స్‌లో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, కెమెరా ముందు నటులు ప్రొఫెషనల్‌గా ఉండాలని తేజ పట్టుబడేవారని సదా తెలిపారు. జయం షూటింగ్ అనుభవం తనను ఒక నటిగా తీర్చిదిద్దిందని, అది ఒక మోల్డింగ్ ఎక్స్‌పీరియన్స్ అని పేర్కొన్నారు. ఆ సినిమా లేకపోతే తనకు పని పట్ల తాను అంత క్యాజువల్‌గా ఉండేదానినని చెప్పారు.ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌తో పని చేసిన అనుభవాలను వివరిస్తూ, విక్రమ్‌తో లపరిచితుడు (అన్నియన్) సినిమా సమయంలో తనకు కొంత భయం ఉండేదని సదా అంగీకరించారు. విక్రమ్ గొప్ప నటుడని, ఆయన స్థాయికి తగ్గ నటనను ప్రదర్శించాలనే ఒత్తిడి ఉండేదని ఆమె తెలిపారు. దర్శకుడు శంకర్ మార్గదర్శకత్వం వల్ల తాను బాగా నటించగలిగానని పేర్కొన్నారు.జూనియర్ ఎన్టీఆర్‌తో నాగా సినిమాలో డాన్స్ చేయడం గురించి మాట్లాడుతూ, ఆయన అద్భుతమైన డాన్సర్ అని, ఒక్కసారి చూసి వెంటనే నేర్చుకునే సామర్థ్యం ఆయనకు ఉందని కొనియాడారు. అప్పట్లో తనకు తెలుగు రాకపోవడం, రీహార్సల్స్‌కు ఎక్కువ సమయం పట్టడం వంటి సవాళ్లు ఎదురయ్యేవని, కానీ ఎన్టీఆర్ వెంటనే టేక్స్ ఇచ్చేవారని చెప్పారు. ఆయన పని పట్ల ఎంత అంకితభావం, అభిరుచి ఉన్న వ్యక్తి అని సదా అన్నారు.తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, గత 20 సంవత్సరాల ప్రయాణంలో ఎలాంటి గాసిప్‌లు, వివాదాలకు తాను దూరంగా ఉన్నానని సదా తెలిపారు. జీవితంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమే ముఖ్యమని, గతం నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలని ఆమె అన్నారు. భవిష్యత్తు గురించి ఊహించుకోవడం కంటే వర్తమానంలో ఆనందంగా ఉండడానికే ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. తన వృత్తితో పాటు కేఫ్ నడపడం, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ వంటివి తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయని సదా పేర్కొన్నారు.





మండాడి రికార్డ్ మైల్ స్టోన్..

-స్టార్ హీరోకు ధీటుగా దూసుకెళ్తున్న సూరి



టాలీవుడ్ యాక్టర్ సుహాస్, తమిళ నటుడు సూరి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం మండాడి . సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ మూవీని సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేశాడు. రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన మండాడి సూరి కెరీర్‌లో గ్లోబల్‌వైడ్‌గా రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన తొలి సినిమాగా నిలిచింది. మండాడి తెలుగు వెర్షన్ కూడా కమర్షియల్ సక్సెస్ అందుకుంది.సూరి సొంత రాష్ట్రం తమిళనాడులో బాక్సాఫీస్ వద్ద రూ.80 కోట్లు వసూలుచేసిన ఈ మూవీ రూ.100 కోట్ల మైల్ స్టోన్ దిశగా ముందుకెళ్తోంది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలే ఈ మార్క్‌ను చేరుకుంటాయి. ఒకవేళ మూడంకెల డిజిట్‌ను దాటుకుందంటే సూరి కెరీర్‌లో ఇదొక హిస్టారికల్ అచీవ్‌మెంట్‌గా నిలిచిపోనుంది. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో నటించాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా.. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కించింది. మరి రాబోయే రోజుల్లో మండాడి బాక్సాఫీస్ వసూళ్లు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఓటీటీలోకి కార్తీ 'సర్దార్ 2'..

- మూడు వారాల్లోనే డిజిటల్ ఎంట్రీ!



తమిళ హీరో కార్తీ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా.. కార్తీ కెరీర్‌లో విజయవంతమైన చిత్రాల్లో ఒకటైన 'సర్దార్'కు కొనసాగింపుగా రూపొందింది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ సీక్వెల్ మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మిశ్రమ స్పందనే లభించింది. ఇప్పుడు థియేట్రికల్ రన్ ముగించుకుని డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'సర్దార్ 2' అక్టోబర్ 1 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ముఖ్యంగా ఈ సినిమా థియేటర్లలో సెప్టెంబర్ 10న విడుదల కాగా.. కేవలం మూడు వారాల్లోనే ఓటీటీలోకి వస్తుండటం గమనార్హం.అంతేకాదు.. ఓటీటీ విడుదలను కేవలం తమిళానికి మాత్రమే పరిమితం చేయకుండా పలు భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించవచ్చు. థియేటర్లలో మిస్ అయిన వారికి, మరోసారి సినిమాను చూడాలనుకునే కార్తీ అభిమానులకు ఇది మంచి అవకాశం కానుంది. 'సర్దార్ 2'లో కార్తీ మరోసారి విభిన్నమైన పాత్రల్లో కనిపించారు. ఈ సినిమాలో ఆయన తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో ఒక వైపు కనిపిస్తే.. మరోవైపు ఇన్‌స్పెక్టర్ విజయ్ ప్రకాష్‌గా నటించారు. ఈ రెండు పాత్రల మధ్య ఉండే వ్యత్యాసం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ కథానాయికలుగా నటించగా.. ఎస్.జే. సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. స్పై యాక్షన్ అంశాలతో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలతో సినిమాను తెరకెక్కించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఎస్. లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని నిర్మించారు. సామ్ సీఎస్ సంగీతం అందించగా.. జార్జ్ సి. విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేశారు. తెలుగులో ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేసింది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఫలితం అందుకోలేకపోయిన 'సర్దార్ 2'.. ఓటీటీలో మాత్రం ఎలాంటి స్పందనను అందుకుంటుందో చూడాలి. ముఖ్యంగా బహుభాషల్లో స్ట్రీమింగ్ కావడంతో డిజిటల్ ప్రేక్షకుల్లో సినిమాపై మరోసారి ఆసక్తి ఏర్పడే అవకాశం ఉంది.

13ఏళ్లుగా అతనితో రిలేషన్‌లో ఉన్నా..

-అందుకే బయటపెట్టలేదు: తాప్సీ పన్ను

సినీ తారల వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అభిమానుల్లో ఎప్పుడూ ఉంటుంది. అయితే కొందరు మాత్రం కెమెరాల ముందు ఎంత యాక్టివ్‌గా ఉన్నా.. తమ పర్సనల్ లైఫ్‌ను మాత్రం చాలా ప్రైవేట్‌గా ఉంచుతారు. అలాంటి వారిలో బాలీవుడ్ నటి తాప్సీ పన్ను కూడా ఒకరు. తన సినిమాలు, కెరీర్‌కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకునే ఈ ముద్దుగుమ్మ.. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాల్లో మాత్రం బయటపెట్టదు. తాప్సీ పన్ను.. మాజీ డెన్మార్క్ ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్, కోచ్ మథియాస్ బోయ్ తో చాలాకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరి బంధం దాదాపు 13 ఏళ్లుగా కొనసాగుతోంది. 2024లో వీరి వివాహం జరిగినప్పటికీ, పెళ్లికి సంబంధించిన విషయాలను తాప్సీ పెద్దగా బయటకు తీసుకురాలేదు. సోషల్ మీడియాలోనూ తన వ్యక్తిగత జీవితాన్ని చాలా తక్కువగా చూపిస్తుంటుంది ఈ అమ్మడు. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో తాప్సీ తన రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది.తన వివాహ బంధానికి పునాది ఏంటో చెబుతూ.. పరస్పర గౌరవమే తమ బంధానికి ప్రధాన కారణమని స్పష్టం చేసింది. తాను బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సమయంలోనే మథియాస్‌తో తన రిలేషన్‌షిప్ ప్రారంభమైందని తాప్సీ తెలిపింది. ఇన్నేళ్లుగా కలిసి ప్రయాణించిన తమ బంధంపై తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పింది. జీవితంలో తీసుకున్న నిర్ణయాల్లో మథియాస్‌ను ఎంచుకోవడం అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని ఈ అమ్మడు పేర్కొంది.తన కుటుంబం తనకు జీవితంలో లభించిన వరమైతే.. కెరీర్ అనుకోకుండా వచ్చిన అవకాశం అని, కానీ జీవిత భాగస్వామిని మాత్రం తానే ఎంచుకున్నానని తాప్సీ చెప్పింది. అందుకే ఈ నిర్ణయంపై తనకు ఎంతో గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. మథియాస్‌తో తమ అనుబంధం గురించి మాట్లాడిన తాప్సీ.. ఇన్నేళ్లుగా తమ మధ్య ఎంతో భద్రత, నమ్మకం ఏర్పడిందని తెలిపింది. అయితే వీటన్నింటికంటే ముఖ్యంగా ఒకరిపై మరొకరికి ఉన్న గౌరవమే తమ బంధాన్ని బలంగా నిలబెట్టిందని చెప్పింది.అలాగే సినీ పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు తమ జీవితంలో ప్రేమను వెతుక్కుంటున్నారని తాప్సీ పేర్కొంది. అయితే అదే సమయంలో సంబంధాలను ఎక్కువకాలం కొనసాగించడం ప్రస్తుతం మరింత కష్టంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. తాత్కాలిక ఆనందాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామా.? అనే ప్రశ్నను కూడా ఆమె ప్రస్తావించింది. తన వ్యక్తిగత అనుభవం మాత్రం దీనికి భిన్నంగా ఉందని తెలిపింది. తమ బంధం ఇన్నేళ్లుగా కొనసాగడానికి పరస్పర గౌరవం, అవగాహన, నమ్మకమే కారణమని తాప్సీ చెప్పుకొచ్చింది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com